31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

శనివారం,సెప్టెంబర్ 12 , 2026

పేజీలు : 8

## మట్టి వినాయకులనే పూజిద్దాం





**చురకలు ప్రతినిధి హుజురాబాద్, సెప్టెంబర్ 11:** హుజురాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ జీనియస్ పాఠశాలలో శుక్రవారం వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వయంగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా. వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. వినాయక చవితి కులమతాలకు అతీతంగా ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చే పండుగ అని అన్నారు. అందరూ కలిసికట్టుగా మండపాలను ఏర్పాటు -మిగతా 2లో

### అభివృద్ధి పనులను వేగవంతం చేసి

# నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

- పనుల్లో సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలి..
- ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి.
- స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని సమస్యలను పరిష్కరించాలి
- దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న 127 ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి
- జగిత్యాల కలెక్టర్ బి. సత్యప్రసాద్




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 11 :** అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. జిల్లాలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో మంజూరైన ప్రతి అభివృద్ధి పనిని నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. పనుల అమలులో ఏవైనా సమస్యలు ఎదురైతే వాటిని వెంటనే పరిష్కరించాలని, అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి అయినా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు మధ్యలో నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల వారీగా పూర్తయిన పనులు, పురోగతిలో ఉన్న పనులు, ప్రారంభం కాని పనుల వివరాలను కలెక్టర్ సమీక్షించారు. తదుపరి సమీక్ష సమావేశం నాటికి ప్రతి పనిలో స్పష్టమైన పురోగతి కనిపించేలా అధికారులు లక్ష్యాలను నిర్దేశించుకొని పనిచేయాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని భూ సమస్యలు, సాంకేతిక సమస్యలు, ఇతర పరిపాలనా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కొన్ని భవన నిర్మాణ పనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నందున, వాటిని త్వరితగతిన పూర్తి ప్రక్రియలు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. జిల్లాలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ పరిధిలో మొత్తం 2,949 పనులకు రూ.497.03 కోట్ల అంచనా వ్యయం ఉండగా, ఇప్పటివరకు రూ.128.13 కోట్ల వ్యయం జరిగినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వీటిలో 842 పనులు పూర్తికాగా, 839 పనులు పురోగతిలో, 1,268 పనులు ప్రారంభం కాలేదు.127 ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ అంశాలు చాలాకాలంగా పరిష్కారం కాకుండా ఉన్నందున వాటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అంగన్‌వాడీ భవనాల పనుల్లో పురోగతి చాలా తక్కువగా ఉందని, పనుల వేగాన్ని గణనీయంగా పెంచాలని సూచించారు. అలాగే రెండేళ్ల క్రితం మంజూరైన కిచెన్ షెడ్లు, -మిగతా 2లో



## నేరాల నియంత్రణ, విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి

-జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్
-సారంగాపూర్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 11:** నేరాల నియంత్రణ, విజిబుల్ పోలీసింగ్పై ప్రత్యేక దృష్టి సారించా లని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లాలో ని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించే క్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ శుక్రవారం సారంగాపూర్ పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, బీట్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు మరియు నేరస్తులపై నిఘా అంశాలను సవి లక్షించారు. అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఎస్పీ ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది అందరూ విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు. ప్రజలకు భద్రతాభావం కల్పించడంలో విజిబుల్ పోలీసింగ్ కీలక పాత్ర పోషిస్తుందని కావున సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల తరచుగా సందర్శిస్తూ పూర్తి సమాచారం సిబ్బంది అందరి దగ్గర ఉండాలని, గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా పై అధికారులకు తక్షణమే తెలియజేయాలని సూచించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ను మరింత ముమ్మరం చేసి చోరీలు, గంజాయి అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా కొనసాగించాలని సూచించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రాబోవు గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గణేష్ మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లు, పోలీస్ బందోబస్తు, ఊరేగింపు మార్గాల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

- నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు వ్యక్తిగతంగా అందజేయాలి.
- అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం
- కలెక్టర్ బి. సత్యప్రసాద్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ధర్మపురి / సెప్టెంబర్ 11:** ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు వ్యక్తిగతంగా అందజేయాలని,అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యమని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. ధర్మపురి మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను శుక్రవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌లో భాగంగా జారీ చేస్తున్న నోటీసులు, వాటిపై నిర్వహిస్తున్న విచారణ ప్రక్రియ, ఓటర్ల నుంచి సేకరిస్తున్న ఆధారాలు, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న విధానంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఎస్ఐఆర్ నోటీసులపై విచారణను పూర్తి స్థాయిలో, నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల నుంచి సేకరించిన ఆధారాలు, సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు, తేడాలు చోటుచేసుకోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు.నో మ్యాపింగ్ ఓటర్లు, అనామలీస్ ఓటర్లకు సంబంధించిన అన్ని నోటీసులను సంబంధిత ఓటర్లకు వ్యక్తిగతంగా అందజేయాలని ఆదేశించారు. నోటీసుల జారీ, అందజేత, విచారణ, ఓటర్ల నుంచి ఆధారాల సేకరణ, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు తదితర ప్రతి దశను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. అదే సమయంలో అనర్హమైన లేదా తప్పుగా నమోదైన వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి సరిదిద్దేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే మన లక్ష్యం. ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతంగా వ్యవహరించడం, నిబంధనలను కచ్చితంగా పాటించడం అత్యంత ముఖ్యమని" జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పేర్కొన్నారు. అనంతరం 2027 లో రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో ధర్మపురి లోని గోదావరి నది వద్ద జరుగుతున్న పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. -మిగతా 2లో

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న నటుడు ఉత్తేజ్



**చురకలు విలేకరి, మల్యాల, సెప్టెంబర్ 11:** ప్రముఖ సినీ నటుడు ఉత్తేజ్ తన కుమార్తె కుమారితో కలిసి శుక్రవారం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కుమార్తె పాట సినీ రంగంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు పొందేందుకు కొండగట్టు అంజన్నను దర్శించుకున్నట్లు ఉత్తేజ్ తెలిపారు. ఈ శుభ సందర్భంలో తన కుమార్తెకు స్వామివారి ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉత్తేజ్ వెంట జానపద గాయకుడు, నటుడు లల్లాయి మహేష్ గౌడ్, మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, గుడిపేట సర్పంచ్ ఇట్టిరెడ్డి అంజిరెడ్డి, ఆగంతపు వంశీధర్ తదితరులు ఉన్నారు.

## గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి



**చురకలు విలేకరి, గొల్లపల్లి, సెప్టెంబర్ 11 :** గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి అన్నారు. గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గల వివిధ గ్రామాల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణేశ్ మండపాల నిర్వాహకులతో × గొల్లపల్లి పోలీసుల ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్ నర్సింహారెడ్డి గొల్లపల్లి ఎస్ఐ కృష్ణసాగర్ రెడ్డి హాజరై గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని, మండపాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలను సామరస్యంతో, ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించుకోవాలని పోలీసు అధికారులు నిర్వాహకులకు సూచించారు. ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఈ సమావేశానికి గొల్లపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు హాజరయ్యారు.

## అసౌకర్యానికి సహకరించగలరు

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ పెద్దపల్లి సెప్టెంబర్ 11.**



పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో బెడ్ల కొరత ఉంది కావున రోగులు తమకు సహకరించాలి అని పెద్దపెల్లి జిల్లా ఆస్పత్రి సూపర్డెంట్ శ్రీధర్ కోరారు.
పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ప్రస్తుతం వంద పడకల ఆసుపత్రిగా సేవలందిస్తుంది కానీ ఎపిడెమిక్ సీజన్లో భాగంగా ఈరోజు మొత్తం 288 మంది పేషెంట్లు అడ్మిట్ అయి ఉండడం జరిగింది. కావున బెడ్లు సరిపోని కారణంగా ఆసుపత్రిలోని కారిడార్ లో టెంపరరీగా మంచాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించడం జరుగుతుంది. కావున జిల్లా ప్రజలు మౌలిక సదుపాయాలలో కొంచెం అసౌకర్యంగా ఉన్న కారణంగా మాతో సహకరించగలరు, కానీ ట్రీట్మెంట్ పరంగా ఎటువంటి లోటు రాకుండా చూసుకుంటామని ఆసుపత్రి సూపరింటెండెంట్ గారు ఒక ప్రకటనలో తెలియజేశారు ఇంకా ఏమైనా సందేహాలు ఉంటే సూపరింటెండెంట్ నెంబర్ 849906199 కి ఫోన్ చేయగలరు.

# కాంగ్రెస్ సర్కార్ పై కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్న బిఆర్ఎస్

**-దళితులను మొదటి నుంచి మోసం చేస్తూంది కెసిఆరే**

**-కెసిఆర్ కేటీఆర్ హరీష్ రావులు దళితులకు క్షమాపణ చెప్పాలి**

**-కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూడిది రాజేందర్**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 11 :** కాంగ్రెస్ రేవంత్ రెడ్డి సర్కార్ పై బిఆర్ఎస్ పార్టీనేతలు కెసిఆర్ కెటిఆర్ హారీష్‌రావులు కుట్ర పూరితంగా వ్యవహారిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూడిది రాజేందర్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూడిది రాజేందర్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట పాత బస్టాండ్‌లో కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమం శుక్రవారం ఏర్పాటు చేసింది బిఆర్ఎస్ పార్టీ తీరును ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నినాదాలు చేస్తూ సిఎం రేవంత్ రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేశారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పాత బస్టాండులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూడిది రాజేందర్ మాట్లాడుతూ దళితులను మొదటి నుంచి మోసం చేస్తూంది కెసిఆరే అని దళితులను సీఎం చేస్తానని మోసం చేసిండని భూమిలేని నిరుపేదలకు మూడు ఎకరాల చొప్పున వ్యవసాయ భూమి ఇప్పిస్తా అని ఇప్పించలేదని దళితులతో ఓట్లు వేయించుకుని రెండుసార్లు సీఎం అయ్యిండు నాలుగు కోట్ల మంది ప్రజలను మోసం చేసిండు ఇక దళితుల ఓట్ల కోసం రావద్దని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కార్గే గారి ఆధ్వర్యంలో రామ లీల మైదానంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడితే కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అక్కడ శుద్ధి చేస్తే ఎర్రబెల్లిలో దళితులు దండయాత్ర చేసినందుకు ఇక్కడ దళితులు తిరిగిన నేల అని సభ్య సమాజం సిగ్గుపడేలా బి ఆర్ ఎస్ పార్టీ వారు ఆవు పెండ చల్లి శుద్ధిచేసి దళితులను అవమానించినారని ఇందుకు కేసిఆర్ కేటీఆర్ హరీష్ రావులు దళితులకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఇదేనా అని ఆయన ప్రశ్నించారు. శాసనసభ సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధిపై చర్చ పెడితే బిఆర్ఎస్ పార్టీ కుట్రపూరితంగా వ్యవహరించి రచ్చ చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తే సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులు దాన్ని తిప్పి కొట్టినారని అన్నారు, కేటీఆర్ నేతృత్వంలో ప్రజలు ఎమ్మెల్యే ఎంపీ ఎలక్షన్లో బిఆర్ఎస్ పార్టీ కి బుద్ధి చెప్పినా ఇంకా బుద్ధి రావడం లేదన్నారు, దళితుడైన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ గారి పై అనుచితమైన వ్యాఖ్యలు చేసిన తాతా మధు శాసన సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు కింద ఆయనను జైల్లో పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి బాల్రెడ్డి ఎడ్ల రాజ్ కుమార్ లు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ దళితుల పట్ల వ్యవహారిస్తున్న తీరును విదానాలను వారు ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ ప్రెసిడెంట్ గుండాడి రాంరెడ్డి సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు దోమ్మాటి నరసయ్య, హరిదాస్ నగర్ సర్పంచ్ నాగరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ గిరిధర్ రెడ్డి, జిల్లా నాయకులు మర్రి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుల్లపల్లి లక్ష్మారెడ్డి మేడిపల్లి రవీందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఊడుగుల సురేందర్, , మూర్తి వెంకటేష్, గంట వెంకటేష్ గౌడ్ నంది కిషన్ ద్యాగం నారాయణ ఉప్పుల రవి, గుల్లపల్లి శ్రీకాంత్ రెడ్డి, బుర్రవేణి రాజయ్యయాదవ్ చెరుకు ఎల్లయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేసి...

**మొదటి పేజీ తరువాయి....**

అంగన్‌వాడీ భవనాలు, మరుగుదొడ్లు, గ్రామపంచాయతీ భవనాల పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి లేదని, వాటిని ప్రాధాన్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రారంభం కాని పనులన్నీ వచ్చే వారం క్షేత్రస్థాయిలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

**ఉపాధి హామీ పనులపై సమీక్ష....**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, వి బి జి రామ్ జి కింద జిల్లాలో చేపడుతున్న పనుల పురోగతిని కూడా కలెక్టర్ సమీక్షించారు. 2026 సెప్టెంబర్ 11 నాటికి జిల్లాలో మొత్తం 971 ఉపాధి హామీ పనులకు రూ. 77.44 కోట్ల అంచనా వ్యయం ఉండగా, 304 పనులు పూర్తయ్యాయి, 464 పనులు పురోగతిలో ఉన్నాయి, 205 పనులు ప్రారంభం కాలేదు. గత సంవత్సరానికి సంబంధించిన వ్యయం రూ. 14.42 కోట్లు కాగా, 2026--27 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ. 3.57 కోట్ల వ్యయం జరిగింది. మొత్తంగా రూ. 17.99 కోట్ల వ్యయం నమోదైనట్లు అధికారులు వివరించారు. ఉపాధి హామీ కింద గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలల మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు, గ్రామ సంస్థల భవనాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, పలు ఇతర మౌలిక వసతుల పనులు చేపడుతున్నట్లు అధికారులు వివరించారు. ఉపాధి హామీ పనుల్లో ప్రారంభం కాని పనులను కూడా త్వరితగతిన ప్రారంభించి, నిర్దేశించిన 100 రోజుల కార్యాచరణ ప్రకారం పనుల పూర్తికి స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. భూ సమస్యలు, ఏజెన్సీ సమస్యలు, అవసరం లేని పనులు, ద్వంద్వ మంజూర్ల లో వంటి కారణాలతో నిలిచిపోయిన పనులను ఒక్కొక్కటిగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. గ్రామపంచాయతీ భవనాల కింద 90 పనులకు రూ. 17.96 కోట్లు, అంగన్‌వాడీ భవనాల కింద 76 పనులకు రూ. 9.12 కోట్లు, పాఠశాలల మరుగుదొడ్ల కింద 354 పనులకు రూ. 7.08 కోట్లు, కిచెన్ షెడ్ల కింద 98 పనులకు రూ. 5.35 కోట్లు, గ్రామ సంస్థల భవనాల కింద 345 పనులకు రూ. 34.50 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపడుతున్నట్లు అధికారులు వివరించారు.
అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కింద ఒక పనికి రూ. 1.43 కోట్లు, ఉప కేంద్రాల కింద నాలుగు పనులకు రూ. 80 లక్షలు, పలు ఇతర మౌలిక వసతుల పనులకు రూ. 1.20 కోట్ల అంచనా వ్యయంతో పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. ప్రతి పనికి సంబంధించి క్షేత్రస్థాయి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎదురయ్యే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను...

**మొదటి పేజీ తరువాయి...**

ఈ సందర్భంగా పనులను వేగవంతంగా, ప్రణాళికలకు అనుగుణంగా భక్తులకు, విఐపి లకు అసౌకర్యం కలుగకుండా పుష్కర ఘాట్లను నిర్మించాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డిఓ మధుసూదన్, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఇంజనీర్ శాఖ అధికారులు బిఎల్ వో లు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకులనే పూజిద్దాం

**మొదటి పేజీ తరువాయి...**

చేసి స్వామివారిని పూజించడం ద్వారా సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత పెంపొందుతాయని తెలిపారు. మట్టి విగ్రహాలను పూజించడం ద్వారా ప్రకృతి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతుందని డా. నరేందర్ రెడ్డి అన్నారు. రసాయన రంగులు లేని సహజసిద్ధమైన మట్టి వినాయక విగ్రహాలను పూజకు ఉపయోగించడం శ్రేయస్కరమని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించని విధంగా వినాయక చవితి వేడుకలను నిర్వహించాలని కోరారు. విద్యార్థులు తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటింటా పోషణ సంబరాలు



**చురకలు ప్రతినిధి కోరుట్ల,సెప్టెంబర్ 11 :** అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం సందర్భంగా ఇంటింటా పోషణ సంబరాలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతి తెలిపారు.ఈ నెల 9వ తేదీ నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు పోషణ మాసం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.శుక్రవారం కోరుట్లలోని కాల్వగడ్డ-1అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాస కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే టీహెచ్‌ఆర్ (టేక్ హోమ్ రేషన్)ను సద్వినియోగం చేసుకుని పౌష్టికాహారాన్ని ఎలా తీసుకోవాలో తల్లులకు వివరించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే వేడి ఆహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. బాలింతలు, శిశువులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఎదగడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భారతి సూచించారు. పోషకాహారంపై తల్లుల్లో అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త అనసూయతో పాటు తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## యాఖీన్‌పూర్‌లో ఎస్ఐఆర్‌పై అవగాహన సభ



**చురకలు ప్రతినిధి కోరుట్ల, సెప్టెంబర్ ,11 :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా కోరుట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి జీవాకర్ రెడ్డి, కోరుట్ల తహశీల్దార్ కృష్ణ చైతన్య సంయుక్తంగా యాఖీన్‌పూర్‌లో శుక్రవారం నిర్వహించిన అవగాహన సభలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఓటర్లజాబితాలో నమోదైన వివరాల్లో ఏవైనాతప్పులు అసమానతలు (అనామలీస్) ఉంటే వాటిని సరిచేయించుకునేందుకు సమర్పించాల్సిన పత్రాలపై ఓటర్లకు అవగాహన కల్పించారు.ఓటర్ల జాబితాలో తమ పేరు చిరునామా తదితర వివరాలను పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు.ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉన్నట్లయితే నిర్ణీత ప్రక్రియ ప్రకారం సంబంధిత పత్రాలను సమర్పించాలని తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటరు బాధ్యతగా పాల్గొని అవసరమైన సహకారం అందించాలని అధికారులు కోరారు.

## రాజమహేశ్వరి మేడంకు ఘన సన్మానం



**చురకలు ప్రతినిధి కోరుట్ల, సెప్టెంబర్ 11 :** కోరుట్ల మండలం ధర్మారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న రాజమహేశ్వరి మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలు (బెస్ట్ టీచర్) అవార్డు అందుకున్న సందర్భంగా శుక్రవారం ధర్మారం గ్రామ పంచాయతీ,అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా రాజమహేశ్వరి అందిస్తున్న విద్యా సేవలను అభినందిస్తూ గ్రామ సర్పంచ్ రంజిత్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రమేష్,ఉప సర్పంచ్ గణేష్, పంచాయతీ కార్యదర్శి సల్మా సుల్తాన్,ఉపాధ్యాయులు,అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకోవడం ధర్మారం గ్రామానికి,పాఠశాలకు గర్వకారణమని వారు పేర్కొన్నారు.

# పాఠశాల అభివృద్ధికి 18 లక్షల ఎంపీ లాడ్స్

**-విశాఖ ట్రస్ట్ నుండి 25 బెంచీల వితరణ**

**-పాశిగామ పాఠశాలను సందర్శించిన పెద్దపల్లి ఎంపీ. గడ్డం వంశీకృష్ణ**




**చురకలు, విలేఖరి, వెల్గటూర్, సెప్టెంబర్ 11 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం పాశిగామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అదనపు గది నిర్మాణం, బెంచీల కోసం గతంలో ఇచ్చిన హామీలతో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ శుక్రవారం పాఠశాలను సందర్శించి ఎంపీ లాడ్స్ నుండి మంజూరి చేసిన 18 లక్షల నిధుల ప్రొసీడింగ్ తో పాటు విశాఖ ట్రస్ట్ నుండి పాఠశాల విద్యార్థులకు 25 బెంచీలు అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ గతంలో పాఠశాలను సందర్శించిన సమయంలో విద్యార్థులు క్రిందకూర్చోవడం దృష్టిలో పెట్టుకొని బెంచీలను అందజేసినట్లు, అలాగే అదనపు గది నిర్మాణం కోసం నిధులు మంజూరి చేసినట్లు తెలిపారు. సమాజ నిర్మాణం లో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, అదేవిదంగా విద్యార్థులకు పాఠశాలలో సౌఖర్యాలు ఉన్నప్పుడే క్రమశిక్షణతో విద్యాబ్యాసం కొనసాగించే అవకాశం ఉంటుంద న్నారు.పాశిగామ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారి భవిష్యత్తు కోసం క్రమశిక్షణ తో విద్యాబోధన చేయడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్న ఉపాధ్యాయుల సేవలు మరువలేని వన్నారు.సమస్యలను గుర్తించి పరిష్కరించిన ఎంపీ వంశీకృష్ణకు కృతజ్ఞత లు తెలుపుతూ పాఠశాల ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమం లో జిల్లా గ్రంధాలయ చైర్మన్ దినేష్,ఏఎంసి ఇంచార్జ్ చైర్మన్ తిరుపతి,నాయకులు శైలేందర్ రెడ్డి,సర్పంచ్‌లు శిరీష, లక్ష్మణ్,మల్లేశం పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీలంసంపత్, ఉపాధ్యాయులు,విశాఖ ట్రస్ట్ సభ్యులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పెండింగ్ నిధులు విడుదల చేసి నేతన్నలకు అండగా నిలవాలి

**-అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతన కోత మెమో రద్దు చేయాలి**

**-బిఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్.రమణ డిమాండ్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 11 :** మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలను తగ్గిస్తూ డీఎంఏ జారీ చేసిన మెమోను రద్దు చేయాలని ఎమ్మెల్సీ ఎల్.రమణ శాసనమండలిలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ల వేతనం రూ.22,750 నుంచి రూ.16,600కు, కంప్యూటర్ ఆపరేటర్ల వేతనం రూ.22,750 నుంచి రూ.19,500కు, డ్రైవర్ల వేతనం రూ.19,500 నుంచి రూ.16,600కు తగ్గించారని తెలిపారు. వేతనాలు పెంచాల్సిన సమయంలో కోత విధించడం వల్ల ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే పాత వేతనాలను పునరుద్ధరించాలని కోరారు.చేనేత రంగం సమస్యలను ఎమ్మెల్సీ రమణ మండలిలో ప్రస్తావించారు. 16 నెలలుగా పెండింగ్‌లో ఉన్న త్రిఫ్ట్ ఫండ్, 3 నెలలుగా నిలిచిన చేనేత చేయూత నిధులు, ప్రీమియం నిధులు విడుదల చేయకపోవడంతో నేతన్న భీమా సక్రమంగా కొనసాగడం లేదన్నారు.చేనేత సంఘాల్లో పేరుకుపోయిన వస్త్రాలను టెక్స్‌కో ద్వారా కొనుగోలు చేయాలని, రూ.లక్ష రుణమాఫీ మిగిలిన అర్హులకు వర్తింపజేయాలని, సున్నా వడ్డీ నిధులు విడుదల చేయాలని కోరారు. ఇటీవల ఎన్నికైన సంఘాలకు ఉత్పత్తి ఆర్డర్లు ఇవ్వాలని, 60 ఏళ్లు పైబడిన కార్మికులకు ప్రత్యేక సాయం, 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్, నూలు, రసాయనాలపై జీఎస్టీ మినహాయింపు, క్యాష్ క్రెడిట్ పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు.

# శివనామా స్మరణతో మారుమ్రోగిన ఆంజనేయాలయం

**-పురానిపేట ఆలయంలో శివుడికి పంచామృతాభిషేకం**



**చురకలు విలేకరి, జగిత్యాల, సెప్టెంబర్ 10 :** జగిత్యాల పట్టణంలోని పురానిపేటలో కొలువుదీరిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయం శ్రావణ మాస చివరి శుక్రవారం సందర్భంగా భక్తిజన సందోహంతో కిటకిటలాడింది. శివనామస్మరణ, లలితాసహస్ర నామ పారాయణలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది .ఉదయాన్నే సుహాసినిలు తలంటు స్నానాలు ఆచరించి,నూతన వస్త్రాలు ధరించి ఆలయానికి తరలివచ్చారు. ఆలయంలో కొలువుదీరిన మహాశివుడికి అత్యంత భక్తిశ్రద్ధలతో పూలు,పండ్లు, కొబ్బరి కాయలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం పాలు,పెరుగు, తేనె, నెయ్యి,చక్కెరతో కూడిన పంచామృతాలతో శివలింగానికి అభిషేకం నిర్వహించారు. మహిళలు మంగళహారతులు పట్టి, శివాష్టకం పఠిస్తూ భక్తిని చాటుకున్నారు.అనంతరం ఆంజనేయస్వామి, పరమశివుడు, లలితా మాత అమ్మవార్లకు ప్రత్యేక అర్చనలు, కుంకుమ పూజలు జరిపారు. మహిళలు సమూహంగా లలితా సహస్రనామ పారాయణం చేయగా, ఆలయం మొత్తం భక్తిమయ వాతావరణం నెలకొంది. శ్రావణమాసం ప్రారంభం నుండి నెల రోజులుగా ప్రతిరోజూ సాయంత్రం ఆలయంలో లలితా సహస్రనామ పారాయణం నిర్విరామంగా కొనసాగిందని,చివరి శుక్రవారంతో ఈ పారాయణ దీక్ష పూర్తయిందని ఆలయ సభ్యురాలు చెట్ల జానకి తెలిపారు. శ్రావణమాసంలో అమ్మవారిని పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని ఆమె పేర్కొన్నారు.ఆలయ పూజారి మామిడి రాము భక్తుల గోత్ర నామాధులతో అర్చన చేసి ఆశీర్వధించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రముఖులు నలమాసు గంగాధర్, కొయ్యడ రమేష్, చెట్ల గణేష్, చెట్ల జానకి, చౌడారపు శైలజ, ఆనంతుల సరిత, రాగి రమ్య, దాస సావిత్రి, బట్టు సుజాత తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

**లోకమాత పోచమ్మ ఆలయంలో మున్సిపల్ ఛైర్పర్సన్ పూజలు...**

జగిత్యాల పురానిపేటలోని లోకమాత పోచమ్మ తల్లి ఆలయంలో జగిత్యాల మున్సిపల్ ఛైర్పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. లోకమాత పోచమ్మ తల్లి ఆశీస్సులతో పట్టణ ప్రజలు శు భిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆలయం పక్షాన ఛైర్పర్సన్ దంపతులను ఘనంగా సన్మానించారు.స్థానిక కౌన్సిలర్ గాజుల లావణ్య మహేష్, ఆలయ కమిటీ సభ్యులు మాజీ కౌన్సిలర్ గాజుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీ నుంచి 10 టీఎంసీల నీరు విడుదల చేయాలి



**చురకలు ప్రతినిధి, కోరుట్ల,సెప్టెంబర్ 11** : వరి రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చివరి దశలో ఉన్న పంటలను కాపాడేందుకు వెంటనే నీరు విడుదల చేయాలని టిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ డా.రఘు డిమాండ్ చేశారు. సరైన వర్షాలు లేకపోవడం, ఆరు నెలలుగా విద్యుత్ కోతలతో బోర్లు,మోటార్ల ద్వారా కూడా నీరు అందించలేక రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పంటలకు నీరు లేక ఇబ్రహీంపట్నం, కోరుట్లలో రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని, రైతు రోడ్డెక్కాడంటే సమస్య తీవ్రతను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని అన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలో గంగనాల కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడటంతో రైతులే శ్రమదానం చేస్తున్న పరిస్థితి ఉందని, కాలువల నిర్వహణ శాఖ బాధ్యత అని పేర్కొన్నారు. ఎస్సారెస్పీ నుంచి కనీసం 10 టీఎంసీల నీటిని తక్షణమే విడుదల చేసి చివరి ఆయకట్టు వరకు చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, వ్యవసాయానికి కరెంట్ కోతలు లేకుండా చూడాలని కోరారు. పంట ఎండిన తర్వాత పరిహారం కాదు, పంట ఎండకుండా కాపాడటమే ప్రభుత్వ బాధ్యత అని రైతులు కోరుతున్నారని తెలిపారు.

## ఎంపీ వంశీకృష్ణకు ఘనస్వాగతం



**చురకలు,విలేఖరి,వెల్గటూర్, సెప్టెంబర్ 11 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల పర్యటనకు విచ్చేసిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు స్తంభంపల్లి గ్రామ సర్పంచ్ఆధ్వర్యంలోనాయకులు శుక్రవారం బస్టాండ్ వద్ద మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్బంగా గ్రామ సమస్యలు విన్నవించి పరిష్కారం కోసం వినతిపత్రం అందజేశారు.గ్రామ ప్రజాప్రతినిధులు,ప్రజల అభ్యర్థనపై ఎంపీ సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాగండ్ల గంగయ్య,కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు కాశ శ్రీధర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లింగయ్య,నాయకులు కొమరయ్య, లక్ష్మణ్, తిరుపతి, చింతల కొమరయ్య,శివకుమార్,జెల్ల సురేష్,లవంగం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గాయత్రి బ్యాంక్ వార్షికోత్సవ వేడుకలు



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 11 :** గాయత్రి సహకార అర్బన్ బ్యాంక్ 26వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు సీఈవో వనమాల శ్రీనివాస్ మాట్లాడుతూ 2000 సంవత్సరంలో జగిత్యాల కేంద్రంగా యూనిట్ బ్యాంక్గా ప్రారంభమైన గాయత్రి బ్యాంక్ నేడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లో 86 బ్రాంచీలతో రూ.4628 కోట్ల వ్యాపారంతో తెలంగాణలో మొదటి స్థానానికి, దక్షిణ భారతదేశంలో రెండో స్థానానికి చేరిందన్నారు. 9,55,597 మంది వినియోగదారులతో కస్టమర్ బేస్లో దక్షిణ భారతదేశంలో మొదటి స్థానంలో ఉందని తెలిపారు. అనంతరం ప్రమాదంలో మరణించిన గాయత్రి నిర్భయ ఖాతాదారుడు అవారి అమరేందర్కు చెందిన రూ.2 లక్షల చెక్కును వారి కుమారుడు అవారి అక్షయ్ కుమార్కు అందజేశారు.ఈ కార్యక్రమంలో బ్యాంక్ జనరల్ మేనేజర్లు ఎంవీజే శా.., శ్రీలత, ఏజీఎంలు నిత్యనారాయణ, బింగి తిరుపతి, ప్రవీణ్ కుమార్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**-జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై. రమేష్ బాబు**




**చురకలు విలేకరి, కొడిమ్యాల, సెప్టెంబర్ 11 :** విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై. రమేష్ బాబు పిలుపునిచ్చారు.కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన వెల్కమ్ పార్టీ--2026 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమైన దశ అని, ఈ దశలో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్ జీవితాన్ని ప్రభావితం చేస్తాయని తెలిపారు. విద్యార్థులు కేవలం పరీక్షల్లో మార్కులు సాధించడమే కాకుండా జ్ఞానం, క్రమశిక్షణ,నైతిక విలువలు, సమయ పాలన,మంచి ప్రవర్తనను అలవర్చుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.ముఖ్యంగా మాదకద్రవ్యాలు,చెడు వ్యసనాలు, అనవసరమైన సోషల్ మీడియా వినియోగం వంటి వాటికి దూరంగా ఉండి,తమ సమయాన్ని చదువు,క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలు,సామాజిక సేవకు వినియోగించుకోవాలని సూచించారు.తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారని,అధ్యాపకులు విద్యార్థుల ఉన్నతికి నిరంతరం కృషి చేస్తారని,వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో లభిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.మరో అతిథి కొడిమ్యాల సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యకు సకల సౌకర్యాలు కల్పిస్తుంది. కళాశాల వసతులు కల్పనకు తన వంతు సహాయం అందిస్తాను అని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. గోపాల్ మాట్లాడుతూ నూతన విద్యార్థులకు కళాశాల తరపున స్వాగతం పలికారు. విద్యార్థులు కళాశాలలోని విద్యా, సాంస్కృతిక, క్రీడా మరియు ఇతర సహపాఠ్య కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను వెలికితీయాలని సూచించారు .అనంతరం విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, వివిధ వినోదాత్మక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నృసింహుడిని దర్శించుకున్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ



**చురకలు విలేకరి, ధర్మపురి, సెప్టెంబర్ 11 :** పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ శుక్రవారం ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు.దేవస్థాన సాంప్రదాయం ప్రకారం మేళతాళాలతో ఆలయ అధికారులు స్వాగతం పలికారు.అనంతరం స్వామివారి దర్శనం చేసుకున్న ఎంపీకి వేదపండితులు,అర్చకులు ఆశీర్వచనం అందించారు.ఈ సందర్భంగా దేవస్థానం తరఫున ఈఓ సంకటాల శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటాన్ని అందజేసి సన్మానించారు.కార్యక్రమంలో వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్,తహశీల్దార్ శ్రీనివాస్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు,ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసచారి, అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## మట్టి విగ్రహాలతో పర్యావరణానికి మేలు



**చురకలు విలేకరి, రాయికల్, సెప్టెంబర్ 11 :** మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలు నీటిలో సులభంగా కరిగిపోవడంతో నిమజ్జనం అనంతరం పర్యావరణానికి మేలు జరుగుతుందని ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు వేముల మధు అన్నారు. శుక్రవారం రాయికల్ మండలం మైతాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మట్టి గణపతులను తయారు చేయించి విద్యార్థులకు పంపిణీ చేశారు.సహజ మట్టి, పర్యావరణహిత రంగులతో తయారు చేసిన విగ్రహాలను ఎంచుకోవడం ద్వారా నీటి కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం చేసిన వాళ్ళు అవుతారని తెలిపారు.పండుగలో భక్తి, సంప్రదాయాలకు ఎంత ప్రాధాన్యం ఇస్తామో ప్రకృతిని కాపాడటానికీ అంతే ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురుపేర్కొంటున్నారు.ఉపాధ్యాయులు కల్వకోట కార్తీక్,వేముగంటి గిరిధర్,అంతడుపుల గంగారాజం, సిద్దె గంగారాజం, కొండూరి రజినీకాంత్, రాపర్తి నర్సయ్య లు విద్యార్థులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్ పాఠశాలలో మట్టి గణపతుల ప్రదర్శన



**చురకలు, విలేఖరి,వెల్గటూర్, సెప్టెంబర్ 11 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రం విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల లో రాబోయే వినాయక చవితి పండుగను పురస్కరించుకొని విద్యార్థులు శుక్రవారం మట్టి గణపతుల ప్రతిమలతో ప్రదర్శన నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పించేందుకు స్వయంగా విద్యార్థులు మట్టి,పిండి, కూర గాయలతో తయారు చేసిన వినాయక ప్రతిమలను పాఠశాలలో ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల సంరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడంతో పాటు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారయ్యే వినాయక ప్రతిమలతో కలిగే పర్యావరణ కాలుష్యం గురించి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పర్యా వరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజలకు అందించారు. వీలైనంత వరకు సహజమైన మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను వినాయక చవితి పూజల్లో వినియోగించాలని కోరారు. పిన్నవయసు నుండే విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

## నర్సింహులపల్లెలో పోషణ్ మేళ



**చురకలు విలేకరి, బీర్పూర్, సెప్టెంబర్ 11** : పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా బీర్పూర్ మండలం నరసింహులపల్లి గ్రామంలో 4,3,5 అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషణ్ మేళ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ ఎస్.సువర్ణ మాట్లాడుతూ పిల్లలకు ఇంట్లో తయారుచేసిన పౌష్టికాహారం,ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహారం,ఆకుకూరలు,పప్పు దినుసులు, సీజనల్ పండ్లు ఇవ్వాలని సూచించారు.అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించి ర్యాలీ చేపట్టారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.శ్రీలత,వార్డు సభ్యుడు పి.రాజేందర్,అంగన్వాడీ టీచర్లు విజయలక్ష్మి, రాజ్యలక్ష్మి,స్వప్న,ఆశ కార్యకర్త తిరుమల,తల్లులు,కిశోర బాలికలు,పిల్లలు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల ప్రాణాలతో చెలగాటం

**-సేఫ్టీ కిట్లు లేకుండానే ప్రధాన రహదారిపై పనులు**
**-పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 11 :** ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల భద్రతను అధికారులు విస్మరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచాల గొల్లపల్లి సమీపంలోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై పారిశుద్ధ్య కార్మికులు ఎలాంటి రక్షణచర్యలు లేకుండా పనులు చేపట్టడం ఆందోళనకు గురిచేస్తోంది.ప్రధాన రహదారిపై డివైడర్‌పై పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని కార్మికులు తొలగిస్తున్నారు.ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు వేగంగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో కార్మికులకు కనీస భద్రతా పరికరాలు అందించకుండా పనులు చేయించడం వారి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడమేనని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కనీస భద్రతా పరికరాలు కరువు**

పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులకు గ్లౌజులు,మాస్కులు, భద్రతా పాదరక్షలు వంటి కనీస రక్షణ పరికరాలు అందుబాటులో లేవని తెలుస్తోంది.రాత్రి వేళల్లో ప్రధాన రహదారిపై విధులు నిర్వహించాల్సి వస్తే వాహనదారులకు కార్మికులు స్పష్టంగా కనిపించేలా రేడియం జాకెట్లు కూడా అవసరం.అయితే అలాంటి భద్రతా ఏర్పాట్లు లేకుండానే పనులు చేయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**ఏ క్షణంలో ఏ ప్రమాదమో?**

కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై వాహనాలు వేగంగా ప్రయాణిస్తుండటంతో డివైడర్‌పై పనిచేస్తున్న కార్మికులకు ప్రమాదం పొంచి ఉంది. పనులు జరుగుతున్న ప్రాంతంలో ముందస్తు హెచ్చరిక బోర్డులు, శానిటేషన్ సూచికలు, ఇతర రక్షణ చర్యలు ఏర్పాటు చేయకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. వేగంగా వచ్చే వాహనం అదుపుతప్పి కార్మికులను ఢీకొంటే బాధ్యత ఎవరిదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

పారిశుద్ధ్య కార్మికుల భద్రత విషయంలో గ్రామ పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.ప్రధాన రహదారులపై పారిశుద్ధ్య పనులు చేపట్టే సమయంలో కార్మికులకు అవసరమైన సేఫ్టీ కిట్లు, రేడియం జాకెట్లు, హెచ్చరిక బోర్డులు, ఇతర రక్షణ చర్యలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.కార్మికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లిన తర్వాత స్పందించే పరిస్థితి కాకుండా, ముందుగానే భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి పోలీస్ శాఖ భరోసా

**- నిర్మల్ ఎస్పీ**

**చురకలు ప్రతినిధి,నిర్మల్, సెప్టెంబర్, 11 :** నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల కుటుంబాలకు'టీజీ వీర్ ఫ్యామిలీ కార్డులను' జిల్లా ఎస్పీ.జానకి షర్మిల పంపిణీ చేశారు.పోలీస్ అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం,పోలీస్ శాఖ ద్వారా అందించే వివిధ సంక్షేమ ప్రయోజనాలను సులభంగా పొందేందుకు టి.జి.వీర్ ఫ్యామిలీ కార్డు, సంబంధిత పోర్టల్ ఉపయోగ పడనున్నాయి.కుటుంబాలకు అందాల్సిన సంక్షేమ సేవలు,పథకాలకు సంబంధించిన వివరాలను క్రమబద్ధంగా నమోదు చేయడంతో పాటు, వాటి పురోగతిని సులభంగా తెలుసుకునే అవకాశం ఈ వ్యవస్థ ద్వారా కలుగుతుంది.ఆర్థిక సహాయం, పింఛన్లు ,కారుణ్య నియామకాలు, ప్లాట్ లేదా ఇంటి స్థల కేటాయింపులు తదితర అర్హతగల సంక్షేమ ప్రయోజనాలకు సంబంధించిన వివరాలను నమోదు చేసి, వాటి స్థితిని ఎప్పటికప్పుడు ట్రాక్ చేసుకునే విధంగా ఈ వ్యవస్థను రూపొందించారు.అమరవీరుల సేవా వివరాలు, కుటుంబ వివరాలు, వారికి అందుతున్న సంక్షేమ ప్రయోజనాలకు సంబంధించిన సమాచారాన్ని కేంద్రీకృత రికార్డుగా నిర్వహించడం ద్వారా వేగవంతమైన, పారదర్శకమైన సేవలను అందించడం టి.జి.వీర్ ఫ్యామిలీ కార్డు ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి.వి.ఆనంద్ ఆదేశాల మేరకు ఆగస్టు 2026లో ఈ కార్యక్రమానికి సంబంధించిన చర్యలు ప్రారంభించబడ్డాయి. ఈ సందర్భంగా



ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయమని అన్నారు. అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అర్హతగల సంక్షేమ ప్రయోజనాలు వారికి ఎలాంటి జాప్యం లేకుండా అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భైంసా అడిషనల్ ఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్,ఎ.ఓ.ఎం.డి. యూనస్ అలీ,సి.ఐ.లు కృష్ణ,సమ్మయ్య, సత్యనారాయణ,ఆర్.ఐ.లు రాంనిరంజన్, రామకృష్ణ, ఎస్సై.లింబాద్రి, పోలీస్ అసోసియేషన్ సభ్యులు సాయి కుమార్, సాయి కృష్ణ, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, డి.పి.ఓ సిబ్బంది పాల్గొన్నారు.

# 13న హుజురాబాద్లో ఎస్సెసి 1989 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమావేశం

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 11 :** హుజురాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989 ఎస్ఎస్సి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమావేశం ఈనెల 13న ఆదివారం రోజు స్థానిక పట్టణంలోని హనుమకొండ రోడ్డులో ఉన్న మధువని గార్డెన్లో ఉదయం 10 గంటలకు జరుగుతుందని పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ప్రతినిధులు గోలి సురేష్, శనిగరపు నరేందర్, అనుముల ప్రవీణ్ శర్మ, అక్కినపల్లి అనిల్ కుమార్, పొన్నోజు సంతోష్ కుమార్ తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. సుమారు 37 సంవత్సరాల తర్వాత పూర్వ




విద్యార్థులు కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. తన బ్యాచ్ లో ఎంతో మంది విద్యార్థులు ఉపాధ్యాయ వృత్తిలో, సాఫ్ట్వేర్ రంగంలో, వ్యాపార రంగంలో, ప్రభుత్వ ఉద్యోగులుగా, మరికొందరు అమెరికాలో, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని గుర్తు చేశారు. నాటి గురువులు అందించిన ప్రోత్సాహంతోనే అందరూ ఎదిగారని తెలిపారు. ఈ సమావేశానికి నాటి ఉపాధ్యాయులు కూడా హాజరవుతున్నారని, వివిధ ప్రాంతాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఒకే చోట కలిసే అవకాశం లభిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు హాజరై ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాటి హెడ్మాస్టర్ ఆలేటి మదన్మోహన్ రెడ్డి, నాటి ఉపాధ్యాయులు రాధా కిషన్, రామకృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు హాజరవుతున్నారని తెలిపారు. పూర్వ ఐక్యతతో పాఠశాల అభివృద్ధితోపాటు సామాజిక సేవా కార్యక్రమాలు ముందుకు తీసుకు వెళ్తామని వెల్లడించారు.

## కొత్తగట్టులో.. బిఆర్ఎస్ నాయకుని ఔదార్యం

**-జెసిబి సహాయంతో రహదారి గడ్డిని తొలగించిన బి ఆర్ ఎస్ నాయకుడు పూదరి నరేష్**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 11 :** శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలో ఎస్సారెస్పీ ఉపకాలువ నుండి జిల్లా పరిషత్ హైస్కూల్ వరకు చాలా కాలంగా రోడ్డుకు ఇరువైపులా పెరిగిన గడ్డిని గ్రామ బిఆర్ఎస్ నాయకుడు పూదరి నరేష్ జెసిబి సహాయంతో శుక్రవారం తొలగించారు. పెరిగిన గడ్డి కారణంగా విషసర్పాలు,దోమలు ఎక్కువ గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు.గ్రామస్తులు సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో బి ఆర్ ఎస్ నాయకుడు నరేష్ వెంటనే స్పందించారు.జెసిబి సహాయంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న గడ్డిని తొలగించిన నరేష్‌ను సర్పంచ్ సుజాత -రాజిరెడ్డి, గ్రామస్తులు అభినందించారు.

## మట్టి గణపతులతో పర్యావరణ పరిరక్షణకు పిలుపు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 11 :** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించాలని ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పిలుపునిచ్చారు. వినాయక చవితిని పురస్కరించుకుని శుక్రవారం పాఠశాలలో మట్టి గణపతుల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయుల సూచనలతో విద్యార్థులు మట్టితో వివిధ ఆకారాల్లో అందమైన గణపతి విగ్రహాలను స్వయంగా తయారు చేసి, వాటిని పూలతో అలంకరించారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల చెరువులు, నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. మట్టి గణపతి విగ్రహాలను ఉపయోగించడం వల్ల పర్యావరణానికి హాని కలగదని తెలిపారు. వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతులనే పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోషణ అభ్యాన్ సందర్భంగా అవగాహన కార్యక్రమం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 11 :** పోషణ అభ్యాన్ సందర్భంగా ఎల్లారెడ్డిపేటలో స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలతో కలిగే పోషక ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే బరువు తక్కువగా ఉన్న పిల్లలకు అందించే బాలామృతం గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎనుగందుల నరసింహులు గారు పాల్గొని, పిల్లల ఆరోగ్యం, పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. స్థానికంగా లభించే పోషక విలువలున్న ఆహార పదార్థాలను పిల్లలకు అందించాలని సూచించారు.పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సమతుల్య ఆహారం, పోషకాహారం ఎంతో అవసరమని కార్యక్రమంలో వివరించారు.

## మామను సన్మానించిన కోడలు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ సెప్టెంబర్ 11 :** ఇదేం విచిత్రం కాదు. ఇక్కడ జరిగిన సంఘటన వేరు. ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులే,కానీ మామకు కోడలు సన్మానం చేయడం జరిగింది.వివరాల్లోకి వెళితే కమాన్‌పూర్ ఎంపీపీ ఎస్ హెడ్మాస్టర్ జక్కుల లక్ష్మీనారాయణ ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు.దీంతో శుక్రవారం రోజున ఎంఈఓ ఇల్లందుల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని కమాన్ పూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమాన్‌పూర్ ఎంపీడీవో సాదినేని ప్రియాంక హాజరయ్యారు.ఇటీవల లక్ష్మీనారాయణ కుమారుడు జక్కుల అరుణ్ కుమార్‌కు ఎంపీడీవో ప్రియాంక వివాహం జరిగింది.దీంతో స్వయంగా మామకు కోడలు శాలువతో సత్కరించి మేమంటో అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్యనారాయణగౌడ్ ఎంఈఓ ఇల్లందుల విజయకుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

## పర్యావరణ మిత్రుడు మట్టి వినాయకుడు

**-మాంటిస్సోరి పాఠశాల ప్రిన్సిపాల్ గీతాషాజు**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 11 :** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మట్టి వినాయక విగ్రహాలను పూజించి ప్రకృతిని కాపాడాలని మాంటిస్సోరి పాఠశాల ప్రిన్సిపాల్ గీతాషాజు అన్నారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మట్టి, పిండి పదార్థాలతో స్వయంగా వినాయక విగ్రహాలను తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గీతాషాజు మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమవుతాయని, మట్టి, సహజ పదార్థాలతో తయారు చేసిన వినాయక విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యత, పర్యావరణ స్పృహ పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**-మండల విద్యాధికారి శోభారాణి**



**చురకలు విలేఖరి వీణవంక సెప్టెంబర్ 11 :** వీణవంక మండలంలోనీ ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా 20 మంది ఉపాధ్యాయులు మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.వారికి ఎంఈఓ శోభారాణి ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా వీణవంక గ్రామసర్పంచ్ దాసారపు సరోజన హాజరై ఉపాధ్యాయులను ఎంఈఓతో కలిసి సన్మానించారు. ఎంఈఓ మాట్లాడుతూ..అన్ని పాఠశాలలో టీచర్లు పాఠశాలలో విద్యార్థులకు మంచి బోధన్ తో పాటు క్రమశిక్షణ, విద్యార్థుల సంఖ్యను పెంచడం జరిగిందని తెలిపారు. అందరి సమిష్టి కృషిఫలితమే మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్ఎంలు,ఉత్తమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి

**-విగ్రహాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో సమాచారం అందించాలి**

**-నిబంధనలకు లోబడి ఉత్సవాలు నిర్వహించాలి: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (గోదావరిఖని) సెప్టెంబర్ 11 :** ఈ నెల 14వ తేదీ సోమవారం వినాయక చవితి పండుగ సందర్భంగా రామగుండము పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో మండపాలు ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించాలనుకునే వారు తప్పనిసరిగా పోలీస్‌శాఖ అనుమతి పొందాలని రామగుండము పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా తెలిపారు.వినాయక విగ్రహాల ఏర్పాటుకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇందుకోసం https://policeportal.tspolice.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తుదారుని వివరాలు,విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశం,ఆ ప్రదేశం ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందో,విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు,కమిటీ సభ్యుల పేర్లు,వారి ఫోన్ నంబర్లు,విగ్రహాన్ని ప్రతిష్ఠించే తేదీ,నిమజ్జనం చేసే తేదీ, సమయం,ప్రదేశం, నిమజ్జనం చేసే ప్రదేశానికి చేరుకునే వాహనం వివరాలను నమోదు చేయాలి. అదేవిధంగా మండప నిర్వాహకులు, గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు, వాలంటీర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, చిరునామా తదితర వివరాలను కూడా పూర్తిగా నమోదు చేయాలని సూచించారు.పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని పట్టణాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసే గణపతి మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేయాలని కమిషనర్ సూచించారు. ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయడంలో ఇబ్బందులు ఎదురైతే సమీపంలోని పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఉత్సవ కమిటీ సభ్యులు మట్టి వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపనకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా కమిషనరేట్ పోలీస్ యంత్రాంగం 24 గంటలు అందుబాటులో ఉండి అప్రమత్తంగా ఉంటుందని, అత్యవసర సమయంలో వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని తెలిపారు. మండపాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ శాఖ నిబంధనలకు లోబడి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

**-బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 11 :** నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణ విముక్తి పొందిన రోజు సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం డిమాండ్ చేశారు.హుజురాబాద్ దర్శిని ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. దేశానికి 1947ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ తెలంగాణకు మాత్రం రాలేదన్నారు. వేలాది మంది అమరవీరుల త్యాగాలు, సర్దార్ వల్లభాయ్ పటేల్ దృఢ సంకల్పంతో చేపట్టిన 'ఆపరేషన్ పోలో' సైనిక చర్య ఫలితంగా 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని గుర్తుచేశారు. గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించకుండా తెలంగాణ చరిత్రను విస్మరించాయని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను 'ప్రజా పాలన దినోత్సవం' పేరుతో సెప్టెంబర్ 17ను 'విమోచన దినోత్సవం'గా కాకుండా ప్రజా పాలన దినోత్సవంగా రాజకీయ డ్రామాలు చేస్తుందని ఆయన మండిపడ్డారు.కర్ణాటక,మహారాష్ట్రల మాదిరిగానే తెలంగాణలోనూ సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవం'గా జరపాలని బీజేపీ గట్టిగా డిమాండ్ చేస్తూ వస్తుందని,మరోవైపు కేంద్ర ప్రభుత్వం మాత్రం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రతి ఏటా అధికారికంగా 'హైదరాబాద్ విమోచన దినోత్సవం' వేడుకలను నిర్వహిస్తుందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారికంగా విమోచన దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్న స్ఫూర్తితో, రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిని అధికారిక పండగగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. 17న హుజురాబాద్ నియోజకవర్గ కేంద్రంతో పాటు జిల్లావ్యాప్తంగా ప్రతి గ్రామం లోనూ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశం లో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు కనుమల గణపతి,బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, నియోజకవర్గం మండల అధ్యక్షులు తూర్పాటి రాజు కౌన్సిలర్లు కొలుగూరి సుమలత,శీలం శ్రీనివాస్, సర్పంచులు ఉప్పు మహేష్, కుమార్ బిజెపి సీనియర్ నాయకులు రావుల భాస్కర్ రెడ్డి, గంగిశెట్టి రాజు స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమరజీవి వీరస్వామి ఆదర్శప్రాయుడు

**-నేత్రదానంతో చీకటి జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ సెప్టెంబర్ 11 :** ఏకశిల ఫోటోస్టూడియో అండ్ ఫ్రేమ్ వర్క్స్ యజమాని, ప్రముఖ వ్యాపారవేత్త స్వర్గీయ చందనాల వీరస్వామి సమాజానికి చేసిన సేవలు, ఆయన నిరాడంబర జీవితం ఎందరికో ఆదర్శప్రాయమని కమాన్‌పూర్ మాజీ ఎంపీటీసీ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు పిల్లి శంకర్ కొనియాడారు.ఈనెల 1వ తేదీన స్వర్గస్తులైన చందనాల వీరస్వామి 11వరోజు దినకర్మ కార్యక్రమాన్ని వారి దుకాణం (ఏకశిల ఫోటోస్టూడియో) ప్రాంగణంలో కుటుంబ సభ్యులు, మిత్రులు మరియు స్థానికులు ఘనంగా నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో మాజీ ఎంపీటీసీ పిల్లి శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ స్థానిక వ్యాపారులు, ప్రముఖులు మాట్లాడుతూ వీరస్వామి మరణం స్థానిక సమాజానికి, వ్యాపార వర్గానికి తీరని లోటని పేర్కొన్నారు. నిత్యం చిరునవ్వుతో, సౌమ్య స్వభావంతో అందరినీ ఆప్యాయంగా పలకరించే ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ పదిలంగా ఉంటాయని స్మరించుకున్నారు. అనంతరం వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపార సంఘాల ప్రతినిధులు, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు, కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, మిత్రులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని వీరస్వామి కి ఘన నివాళులు అర్పించారు.

# కరెంటు కోతలపై రైతుల రాస్తారోకో

**-జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్**



**చురకలు విలేకరి, జగిత్యాల, సెప్టెంబర్ 11 :** జగిత్యాల జిల్లాలో తీవ్రంగా కొనసాగుతున్న విద్యుత్ కోతలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ కోతలను నిరసిస్తూ జగిత్యాల--నిజామాబాద్ జాతీయ రహదారిపై చల్‌గల్ వద్ద రైతులు రాస్తారోకో చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీలకు, క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరాకు ఏమాత్రం పొంతన లేదని మండిపడ్డారు. 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం కనీసం ఏడు గంటల కరెంటు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతల కారణంగా పంటలకు సకాలంలో సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మోటార్లు కాలిపోతున్నాయని, దీంతో అదనపు ఆర్థిక భారం పడుతోందని వాపోయారు.

**ప్రభుత్వం వెంటనే స్పందించాలి... చల్ గల్ సర్పంచ్ జున్ను రాజేందర్...**

చల్‌గల్ సర్పంచ్ జున్ను రాజేందర్ మాట్లాడుతూ.. రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఇకనైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి నిరంతర విద్యుత్ సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. అభివృద్ధి కోసం పార్టీ మారిన సంజయ్.. ప్రజల అభివృద్ధి కంటే తన రాజకీయ అభివృద్ధిపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారని రైతులు విమర్శించారు. రైతుల రాస్తారోకోతో జగిత్యాల--నిజామాబాద్ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. ఆందోళన విరమించాలని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# 17వ వార్డులో నూతన సీసీ రోడ్డుకు భూమిపూజ



**చురకలు ప్రతినిధి కోరుట్ల, సెప్టెంబర్ 11 :** కోరుట్ల పట్టణంలోని 17వ వార్డులో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ సోగ్రబీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పాల్గొని కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వార్డుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌ల పంపిణీ



**చురకలు ప్రతినిధి కోరుట్ల, సెప్టెంబర్,11 :** సర్వరాజ్‌పూర్ గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నత్తి రాజ్‌కుమార్,ఉప సర్పంచ్ బండారి భూమేష్ ,ఎస్ఎంసీ చైర్మన్ ఒట్టె పద్మ,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యూనిఫామ్‌లను అందజేశారు.

# ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి

**-ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వరప్రసాద్**

**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ (11) :** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలం లోని వేములకుర్తి గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన యువత తప్పనిసరిగా ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే ఓటరు జాబితాలో పేర్లు లేని వారు, చిరునామా మార్పులు, ఫోటో సవరణలు, ఇతర వివరాల మార్పులు అవసరమైన వారు నిర్దేశిత గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. బీఎల్వోలు గ్రామస్థులకు అందుబాటులో ఉండి ప్రతి దరఖాస్తును పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. గ్రామస్థులు కూడా ఓటరు జాబితాను



పరిశీలించి లోపాలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తరి రామానుజం, ఉప సర్పంచ్ బర్మ మల్లయ్య, ఆర్ ఐ రెవంత్ రెడ్డి,జిపిఓ శ్రీనాథ్,పంచాయతీ కార్యదర్శి ముదాం బల చందర్ ,బిఎల్వోలు కుమారం మాధవి, లోక సరిత, పుప్పాల రమ్య, వార్డు సభ్యులు,నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జువ్వాడి నర్సింగ్ రావుకు ఘన సన్మానం



**చురకలు ప్రతినిధి కోరుట్ల, సెప్టెంబర్ 11 :** కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగ్ రావును మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మొహమ్మద్ రైసోద్దీన్ ఆధ్వర్యంలో శు క్రవారం ఘనంగా సన్మానించారు. కోరుట్ల నియోజకవర్గ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన ఈఎస్ఐ ఆసుపత్రిని కోరుట్లలో మంజూరు చేయించేందుకు ప్రభుత్వ పెద్దలతో ప్రత్యేకంగా మాట్లాడి కృషి చేసినందుకు నర్సింగ్ రావుకు కాంగ్రెస్ నాయకులు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధి చరిత్రలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యేక స్థానం ఉందని నాయకులు పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జువ్వాడి రత్నాకర్ రావు నాయకత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, అదే అభివృద్ధి వారసత్వాన్ని కొనసాగిస్తూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కూడా నియోజకవర్గం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. కోరుట్లలో ఈఎస్ఐ ఆసుపత్రి మంజూరు కావడం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో కీలక ముందడుగు అని తెలిపారు. ఇది నర్సింగ్ రావు పట్టుదల, ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. నాడు రత్నాకర్ రావు హయాంలో అభివృద్ధి నేడు నర్సింగ్ రావు నాయకత్వంలో అభివృద్ధి అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కోరుట్ల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బర్ల సూరి, మెట్‌పల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి జెట్టి లక్ష్మణ్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు మాధవరెడ్డి, ముఖీమ్, బర్ల వంశీ, పులిమామిడి ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్ రావు, నవీన్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**-హుజురాబాద్ మునిసిపల్ చైర్ పర్సన్ ఆర్ సుహాసిని**



**చురకలు ప్రతినిధి, హుజురాబాద్, సెప్టెంబర్ 11 :** సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయులు కీలకమని హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రోశీటాల సుహాసిని అన్నారు. శుక్రవారం హుజురాబాద్ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉత్తమ ప్రభుత్వ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... ఉపాధ్యాయుల వల్లనే దేశ భవిష్యత్తు మారుతుందని ఆ విషయం సమాజం గుర్తించిందన్నారు. ఎంపీడీవో తూర్పాటి సునీత మాట్లాడుతూ.... ఉపాధ్యాయుల గొప్పతనం తెలుసుకున్న సమాజం మరింత అభివృద్ధి చెందుతుంది అన్నారు. మండలంలో నో అడ్మిషన్స్ అనే విధంగా బోర్డు ఉండే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని దానికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. ఎంఈఓ విడపు శ్రీనివాస్ మాట్లాడుతూ...ప్రతి ఏడాది ఉపాధ్యాయులను మరింత ప్రోత్సహించే ఉద్దేశంతో అవార్డులను అందిస్తున్నామని అన్నారు. ప్రతి ఏడు ఉపాధ్యాయుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మండలంలో మొత్తము 18మంది ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మండలం లోని వివిధ కాంప్లెక్స్ లో గల ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా ఉపాధ్యాయ సంఘాలు అధికారులు ప్రజా ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు దేవరం శోభారాణి, అనురాధ, శ్రీ భవాని, ఉపాధ్యాయ సంఘం నాయకులు పోలంపల్లి ఆదర్శ రెడ్డి, అజ్మీరా రవి నాయక్, చక్రధర్, భాగ్యరేఖ, కొండి రవీందర్, కొంపల్లి సంజీవ్, మండలంలో ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# రామగుండం అభివృద్ధికి కేంద్రంపై ఒత్తిడి

**-ప్రజలు,కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎంపీ వంశీకృష్ణ**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (గోదావరిఖని) సెప్టెంబర్ 11 :** పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ రామగుండం ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ సీనియర్ నాయకులు బాబర్ సలీం పాషా, గుమ్మడి కుమారస్వామి తదితరులు ఎంపీకి ఘన స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు.అనంతరం ఎన్టీపీసీలోని ఐఎన్‌టీయూసీ నాయకులు బాబర్ సలీం పాషా నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీ వంశీకృష్ణ మాట్లాడారు. రామగుండం ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కాకా వెంకటస్వామి కాలం నుంచి తమ కుటుంబం, కాంగ్రెస్ పార్టీ నిరంతరం కార్మికుల పక్షాన నిలబడి పోరాడుతున్నాయని తెలిపారు.విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత ఉన్నతాధికారులతో పాటు గురుదీప్ సింగ్‌ను కూడా కలిసి సమస్యలను వివరించినట్లు ఎంపీ తెలిపారు. స్థానిక కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోకపోతే ప్రజలు, కార్మికుల పక్షాన నిలబడి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు దళితుల పట్ల అనుసరిస్తున్న విధానాలను ఎంపీ వంశీకృష్ణ తీవ్రంగా విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరుగుతున్నా బీజేపీ నాయకులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. అయోధ్య నిధుల దుర్వినియోగం అంశంపై కూడా బీజేపీ నాయకులు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ శుద్ధి కార్యక్రమాల పేరుతో రాజకీయ డ్రామాలు చేస్తున్నాయని విమర్శించారు. కేటీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ నాయకులు నిర్వహిస్తున్న రాజకీయ కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

**రామగుండం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

రామగుండం ప్రాంత ప్రజల చిరకాలఅవసరాలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వ స్థాయిలో నిరంతరం ప్రయత్నిస్తున్నామని ఎంపీ వంశీకృష్ణ తెలిపారు. రామగుండంలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు కోసం కేంద్ర మంత్రులతో చర్చలు జరుపుతున్నామని ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించడమే లక్ష్యమన్నారు.రామగుండం ప్రాంతానికి అవసరమైన రైల్వే సౌకర్యాల కోసం రైల్వే ఉన్నతాధికారులను ఎప్పటికప్పుడు కలిసి ప్రజల సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్తున్నామని చెప్పారు. రామగుండం విమానాశ్రయం ఏర్పాటు కోసం కూడా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నామని ఎంపీ వెల్లడించారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంగా మరింత అభివృద్ధి చెందడంతో పాటు స్థానిక యువతకు, కార్మికులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు తన వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.రామగుండం ప్రజలు, కార్మికుల సమస్యలు తన దృష్టికి వచ్చిన ప్రతిసారీ వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులను కలుస్తూ, అవసరమైతే కేంద్ర స్థాయిలో కూడా పోరాడుతానని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.

# దళితులపై దాడులను అరికట్టాలి




**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ సెప్టెంబర్ 11 :** దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. పెద్దపల్లి మండలం పెద్దకల్వలలో ప్లాట్ కొనుగోలు చేసేందుకు వెళ్లిన తనను కులం పేరుతో దూషించి, చంపుతామని చెలుకల శ్రీనివాస్, ఐలయ్య, మనోజ్ బెదిరించారని బాధితుడు కుక్క కనకరాజు ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఐక్యవేదిక నాయకులు బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కలెక్టర్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బాధితుడి ఫిర్యాదుపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితుడికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని, సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని పోలీసు యంత్రాంగాన్ని హెచ్చరించారు.కార్యక్రమంలో కుక్క శ్రావణ్ కుమార్, కుక్క అశోక్, బొంకూరి నరేందర్, మామిడిపల్లి బాపయ్య, సంబయ్య, సతీష్, రామిళ్ల శారద, కల్లపెల్లి అశోక్, మోదుంపెల్లి శ్రావణ్, నూనె వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ మన అందరి ధ్యేయం కావాలి



చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 11: వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి ప్రతిమలను ప్రతిష్ఠించాలని జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత ప్రజలను కోరారు. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మట్టి గణపతులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బిఎస్ లత మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి ధ్యేయం కావాలని, ఈ నినాదంతోనే కాలుష్యనియంత్రణ మండలి జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని వివరించారు. ఈ మట్టి గణపతి విగ్రహాలను జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఈ.కిషన్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ ఎం ఉదయ్ కుమార్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు ఎండి వకీల్, క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ ఉద్యోగుల ఉపాధ్యక్షులు ముజాహిద్ ఖాన్, ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా కమిటీ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్, కలెక్టరేట్ ఉద్యోగులు, కాలుష్య నియంత్రణ మండలి ఉద్యోగులు పాల్గొన్నారు.

# "డీజే వద్దు... బాజా ముద్దు"



**-గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో డీజే సౌండ్ సిస్టమ్‌కు అనుమతి లేదు : ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి**

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ సెప్టెంబర్ 11 :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లోని గోదావరిఖని వన్ టౌన్ పరిధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని గోదావరిఖని వన్టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు గోదావరిఖని పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖని పోలీస్ స్టేషన్ పరిధిలోని డీజే ఆపరేటర్లు, యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గోదావరిఖని ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ, గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగానికి ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. మండప నిర్వాహకులు, భక్తులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు.ఉత్సవాల్లో సాధారణ సౌండ్ సిస్టమ్‌ను మాత్రమే వినియోగించాలని,మైక్ సిస్టమ్‌ను రాత్రి 10గంటల వరకు మాత్రమే ఉపయోగించాలని సూచించారు. పోలీసుల ఆదేశాలను ఉల్లంఘించి డీజే సౌండ్ సిస్టమ్‌ను వినియోగించినట్లయితే ,సంబంధిత డీజే ఆపరేటర్లు, యజమానులు,మండప నిర్వాహకులపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ హెచ్చరించారు. నిబంధనల ఉల్లంఘనకు అవకాశం లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డీజే ఆపరేటర్లు,యజమానులను ఈరోజు బైండోవర్ చేసినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు.గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో,సంతోషంగా జరుపు కోవాలని,అదే సమయంలో పోలీస్‌శాఖ సూచించిన నియమ నిబంధనలను తప్పనిసరిగాపాటించాలని ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి కోరారు. "డీజేకు దూరంగా ఉండి బాజాతో భక్తి భావాన్ని చాటుకుందాం.ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించి గణనాథుని ఆశీర్వాదం పొందుదాం"అని ఇన్స్పెక్టర్ ఆకాంక్షించారు.

## ఉన్మత్త భైరవ దేవాలయంలో

# మహా పాలాభిషేకం



**చురకలు ప్రతినిధి,హనుమకొండ సెప్టెంబర్ 11 :** హనుమకొండ పద్మాక్షి రోడ్ మారుతిహిల్స్‌లో గల శ్రీ వారాహి సహిత ఉన్మత్త భైరవ దేవాలయంలో శుక్రవారం శ్రావణ మాసం ముగింపు పొలాల అమావాస్య సందర్భంగా దేవాలయంలో భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా మహా పాలాభిషేకం నిర్వహించారు.108 లీటర్ల ఆవుపాలతో పాలాభిషేకం అమ్మవారికి స్వామివారికి భక్తులు సమర్పించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకులు వీరభద్రనాథ్ మాట్లాడుతూ ఈ అమావాస్య ఎంతో శక్తివంతమైనదని, వందేళ్లకు ఒకసారి వచ్చే ఈ అమావాస్య రోజు భక్తిశ్రద్ధలతోటి భక్తులు పాల్గొని కూష్మాండ దీపం, మిరియాల దీపం, నారికేల దీపాలు పెట్టి వారి భక్తిని చాటుకుంటారని అన్నారు.ఈ కార్యక్రమంలో అమ్మవారికి, స్వామివారికి అంతంత వైభవంగా అలంకరణ, మహా హారతి,అన్నదాన ప్రసాదం దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.